RNI TITLE CODE: 16425 www.andhrapragathi.com

ప్రతి అక్షరం ప్రజాహితం

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి
నూతనంగా ప్రారంభించబడి అత్యంత ప్రజాదరణ
పొందుతున్న తెలుగు దినపత్రిక ఆంధ్రప్రగతిలో పనిచేసేందుకు
ఉత్సాహవంతులైన పాత్రికేయులను ఆహ్వానిస్తున్నాము.
జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు,
మండల రిపోర్టర్లు కావలెను. (కొత్తవారికి అవకాశం కల్పించబడును)

సెల్: 8121133006
9494220260

ప్రతి అక్షరం ప్రజాహితం ఆంధ్రప్రగతి తెలుగు దినపత్రిక

సంపుటి - 01 సంచిక - 296 పేజీలు - 04 వెల - 05/- ఎడిటర్ : సి యం శ్రీనివాస్

బుధవారం 3 జూలై 2024

# పాలనలో మార్పు స్పష్టంగా కనిపించాలి..

## అధికారులు వేగంగా పని చేయాలి.! - సిఎం నారా చంద్రబాబు నాయుడు.

**ఆంధ్ర ప్రగతి అమరావతి జులై 02:** రాష్ట్రంలో ఇసుక లభ్యత, నూతన ఇసుక పాలసీ, దెబ్బతిన్న రోడ్లు, నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమీక్ష చేశారు. సచివాలయంలో ఆయా శాఖల మంత్రులు, అధికారులతో మంగళవారం సిఎం సమీక్షలు నిర్వహించారు. గత ప్రభుత్వ విధానాల వల్ల ప్రజలు అనేక సమస్యల్లో ఉన్నారని....వాటి పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అన్నారు. దీనికి అవసరమైన రూట్ మ్యాప్ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. సమస్యల తీవ్రత దృష్ట్యా తక్షణమే ఎలాంటి చర్యలు తీసుకోవాలి.....దీర్ఘకాలికంగా ఎటువంటి ప్రణాళికలు అమలు చేయాలి అనే విషయంపై నిర్దిష్టమైన విధానాలతో అధికారులు పనిచేయాలని సిఎం అన్నారు.

మిగతా 2లో



# చంద్రబాబు, రేవంత్ రెడ్డిల కీలక సమావేశానికి ఏర్పాట్లు.!

-ఈ నెల 6న ముఖ్యమంత్రుల సమావేశం.

-అజెండాను సిద్ధం చేస్తోన్న తెలంగాణ ప్రభుత్వం.



**ఆంధ్ర ప్రగతి అమరావతి జూలై 02:** ఉభయ తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశం ఈ నెల 6న హైదరాబాద్‌లో జరగనుంది. చంద్రబాబు, రేవంత్ రెడ్డి సమావేశానికి అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. సమావేశంలో చర్చించాల్సిన అజెండాను తెలంగాణ ప్రభుత్వం సిద్ధం చేస్తోంది. ఈ నెల ఆరో తేదీన జరిగే సమావేశానికి ఏర్పాట్లు చేయాలని అధికార యంత్రాంగాన్ని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారని తెలుస్తోంది. మంత్రులు, ఉన్నతాధికారులతో ఈ విషయమై సీఎం చర్చించనున్నారు.రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు పూర్తయింది. అయినప్పటికీ పలు అంశాలు ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్నాయి. పునర్విభజన చట్టంలోని తొమ్మిదో షెడ్యూల్‌లో ఉన్న ఆర్టీసీ, రాష్ట్ర ఆర్థిక సంఘం తదితర 23 కార్పోరేషన్ల ఆస్తులపై ఏపీ, తెలంగాణ మధ్య ఏకాభిప్రాయం కుదరవలసి ఉంది.పదో షెడ్యూల్‌లోని తెలుగు అకాడమీ, అంబేడ్కర్, తెలుగు యూనివర్సిటీ వంటి 30 సంస్థల ఆస్తులు, సేవలపై కూడా భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. రాజ్ భవన్, హైకోర్టు, లోకాయుక్త, కార్మిక సంక్షేమ నిధి, వాణిజ్య పన్నులు, విద్యుత్ సంస్థల బకాయిలపై వివాదాలు కొనసాగుతున్నాయి.వివిధ అంశాలపై కేంద్ర హోంశాఖ ఇరు రాష్ట్రాలతో పలుమార్లు ఉమ్మడి సమావేశం నిర్వహించింది. అయినప్పటికీ పరిష్కారం కాలేదు.

# ఎన్నిక లాంఛనమే

## ఎమ్మెల్సీ అభ్యర్థులుగా రామచంద్రయ్య, హరిప్రసాద్ నామినేషన్లు



**ఆంధ్ర ప్రగతి అమరావతి జులై 02:** ఏపీ శాసనమండలిలో ఖాళీగా ఉన్న రెండు ఎమ్మెల్యే కోటా సీట్లకు అభ్యర్థుల నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. ఇవాళ ఎన్డీయే కూటమికి చెందిన ఇద్దరు అభ్యర్థులు సి రామచంద్రయ్య (టీడీపీ), పి హరిప్రసాద్ (జనసేన) నామినేషన్లు దాఖలు చేశారు. వీరిద్దరూ ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థులుగా పోటీ పడనున్నారు. అసెంబ్లీ కార్యదర్శి సమక్షంలో వీరు తమ నామిషన్ పత్రాలను సమర్పించారు. గతంలో వైసీపీ ఎమ్మెల్సీగా ఎన్నికైన సి రామచంద్రయ్య ఎన్నికలకు ముందు టీడీపీలో చేరారు. అయితే వైసీపీ నేతల ఫిర్యాదుతో శాసనమండలి చైర్మన్ మోషేన్ రాజు ఆయనపై అనర్హత వేటు వేశారు. మరో ఎమ్మెల్సీ ఇక్బాల్ కూడా టీడీపీలో చేరగా.. ఆయనపై కూడా అనర్హతా వేటు పడింది. దీంతో ఎమ్మెల్యేల కోటాలో రెండు స్థానాలు ఖాళీ అయ్యాయి. వీటికి ఈసారి తిరిగి రామచంద్రయ్యను టీడీపీ ఎంపిక చేయగా.. జనసేన నుంచి పి హరిప్రసాద్ అభ్యర్థిత్వం ఖరారు చేశారు. దీంతో వీరిద్దరూ ఇవాళ నామినేషన్లు దాఖలు చేశారు. టీడీపీ, జనసేన ఎమ్మెల్సీ అభ్యర్థులు వీళ్లే- అనూహ్యంగా..!! రాష్ట్రంలో రెండు ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానాలకు కేంద్ర ఎన్నికల సంఘం గత నెలలో షెడ్యూల్ విడుదల చేసింది. దీని ప్రకారం జూన్ 25న ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అయింది. నామినేషన్ల స్వీకరణకు ఇవాళ చివరి తేదీ. రేపు అభ్యర్థుల ఆ నామినేషన్లను పరిశీలించనున్నారు. అనంతరం అభ్యర్థులు జులై 5 వరకు నామినేషన్లను ఉపసంహరించుకునేందుకు వీలుంది. అప్పటివరకూ ఇతర నామినేషన్లు రాకపోతే వీరిద్దరూ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధికారులు ప్రకటిస్తారు

# వైసీపీ పాలనలో గ్రామాల అభివృద్ధి నిధులు దారిమళ్లింపు.!

-నిధులు, పథకాలు, రావాల్సిన వాటాలపై హై లెవెల్ కమిటీలో చర్చిస్తాం.

-ఆర్థిక బలంతోనే పంచాయతీల్లో అభివృద్ధి.

-కాలుష్యరహిత పరిశ్రమలకు తగిన ప్రోత్సాహం.

- కాకినాడ జిల్లా అధికారులతో కలెక్టరేట్ లో సమీక్ష అనంతరం మీడియాతో మాట్లాడిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్.

2లో



# విమర్శలకు తావులేకుండా పకడ్బందీగా మెగా డీఎస్సీ

న్యాయపరమైన వివాదాలు లేకుండా ముందుకెళదాం.

-పాఠశాలల్లో అకడమిక్ కేలండర్ రూపకల్పనకు ఆదేశం.

-టెట్, మెగా డీఎస్సీపై సమీక్షలో విద్య, ఐటి మంత్రి లోకేష్.

2లో



# 12 జిల్లాలకు కొత్త కలెక్టర్లు

## కొనసాగుతున్న ఐఏఎస్ ల బదిలీల పర్వం

## 12 జిల్లాలకు కొత్త కలెక్టర్లను నియమిస్తూ సీఎస్ ఉత్తర్వులు

**ఆంధ్ర ప్రగతి అమరావతి జులై 02:** ఏపీలో ప్రభుత్వం మారాక, ఐఏఎస్ ల బదిలీల పర్వం కొనసాగుతోంది. తాజాగా, పలు జిల్లాలకు కొత్త కలెక్టర్లను నియమించారు. ఐఏఎస్ ల బదిలీలపై ఏపీ సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. విశాఖజిల్లా కలెక్టర్ గా హరేంద్ర ప్రసాద్., శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ గా స్వప్నిల్ దినకర్. పార్వపురం కలెక్టర్ గా శ్యాం ప్రసాద్ ,అనకాపల్లి కలెక్టర్ గా విజయ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ గా మహేష్ కుమార్ పల్నాడు జిల్లా కలెక్టరా పి అరుణ్ బాబు , నెల్లూరుజిల్లా కలెక్టర్ గా ఓ. ఆనంద్ తిరుపతి కలెక్టర్ గా వెంకటటేశ్వర్ సలిజామల , అనమయ్య జిల్లా చామకూరి శ్రీధర్ కడప కలెక్టర్ గా శివశంకర్ తోలేటి , సత్యసాయి జిల్లా కలెక్టర్ గా టివిస్ చేతన్ నంద్యాల జిల్లా కలెక్టర్ గా రాజకుమారి

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# విమర్శలకు తావులేకుండా పకడ్బందీగా మెగా డీఎస్సీ

ఆంధ్రప్రగతి అమరావతి జులై 02: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మెగా డిఎస్సీని ఎటువంటి విమర్శలకు తావీయకుండా పారదర్శకంగా నిర్వహించాలని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. టెట్, మెగా డీఎస్సీ నిర్వహణపై పాఠశాల విద్య ఉన్నతాధికారులతో మంత్రి లోకేష్ మంగళవారం సమీక్ష నిర్వహించారు. టెట్ నోటిఫికేషన్ విడుదల, మెగా డీఎస్సీ నేపథ్యంలో అధికారులతో పలు అంశాలపై చర్చించారు. టెట్, మెగా డీఎస్సీ మధ్య ఎక్కువ సమయం ఉండాలని అభ్యర్థుల నుంచి విజ్ఞప్తులు వస్తున్నాయి, డీఎస్సీ ఎప్పుడు నిర్వహించాలనే అంశంపై అభ్యర్థులు, విద్యార్థి, యువజన సంఘాల నుంచి అభిప్రాయ సేకరణ చేయాలని సూచించారు. సిలబస్ విషయంలో సోషల్ మీడియాలో వస్తున్న తప్పుడు ప్రచారంపై మంత్రి ఆరా తీశారు. సిలబస్ లో ఎటువంటి మార్పులు చెయ్యలేదు ఫిబ్రవరి 2024 లో ఏ సిలబస్ తో అయితే టెట్ నిర్వహించామో అదే సిలబస్ తో జూలై 2024 లో పరీక్ష నిర్వహించబోతున్నామని అధికారులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. సిలబస్ వివరాలను %ట్ట్రజూం://ఖజ్ూవ్.ఖజూఎటం౦.ఱఅ% అందుబాటులో ఉంచామని సిలబస్ లో ఎటువంటి మార్పులు చెయ్యలేదని పాత సిలబస్ తో టెట్ నిర్వహణ అంటూ సోషల్ మీడియా లో జరుగుతున్న ప్రచారం లో నిజం లేదని అధికారులు తెలిపారు.

మెగా డీఎస్సీలో కొన్ని జిల్లాలకు పలువిభాగాల్లో తక్కువ పోస్టులు వచ్చాయంటూ పలువురు అభ్యర్థులు తనని కలిసిన విషయాన్ని లోకేష్ అధికారుల వద్ద ప్రస్తావించి వివరాలు అడిగారు. ప్రకాశం జిల్లాలో ఉపాధ్యాయుల పదోన్నతులపై కొంతమంది కోర్టును ఆశ్రయించారని, దీనివల్ల పోస్టులు తగ్గాయని అధికారులు వివరణ ఇచ్చారు. అనంతపురం, శ్రీకాకుళం, నెల్లూరు జిల్లాల్లో పోస్టులకు సంబంధించి న్యాయపరమైన వివాదాలను పరిష్కరించి పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని లోకేష్ అధికారులను ఆదేశించారు. స్కూళ్ల మూసివేతకు సంబంధించి గత ప్రభుత్వం తీసుకొచ్చిన జిఓ. 117 వలన ఎటువంటి నష్టం కలిగిందన్న విషయమై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. మెగా డీఎస్సీలో వయోపరిమితి సడలింపు అంశాలను అధికారులు మంత్రి దృష్టికి తేగా, దీనిపై చర్చించి తగు నిర్ణయం తీసుకుంటామన్నారు. ఎన్నికలకు ముందు గత ప్రభుత్వం విడుదల చేసిన డిఎస్సీ నోటిఫికేషన్ లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ డిఎస్సీలో ఫీజు మినహాయింపు ఇవ్వాలని సమావేశంలో నిర్ణయించారు.ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్స్ లో ఔట్ సోర్సింగ్ కింద పనిచేస్తున్న 1633 మంది బోధన సిబ్బంది డిమాండ్స్ పై అధ్యయనం చేసి వారికి నష్టం జరగకుండా తీసుకోవాల్సిన చర్యల పై రిపోర్ట్ ఇవ్వమని అధికారులను లోకేష్ కోరారు.విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతపై అప్రమత్తంగా ఉండాలని అధికారులకు లోకేష్ సూచించారు. మెనూ ఎలా ఉండాలనే విషయమై విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అభిప్రాయ సేకరణ చేయాలని అన్నారు. వర్షాకాలం నేపథ్యంలో పాఠశాలల్లో పారిశుద్ధ్యం, తాగునీరు వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. ఎటువంటి విమర్శలకు తావులేకుండా పకడ్బందీగా వ్యవహరించాలని అన్నారు. ప్రైవేటు పాఠశాలలకు అనుమతుల రెన్యువల్ విషయంలో అనవసరమైన ఆంక్షలు విధించవద్దని, ప్రైవేటు, ప్రభుత్వరంగాల్లో విద్యాప్రమాణాలు మెరుగుపర్చడమే అంతిమంగా ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రణాళికబద్ధమైన అకడమిక్ క్యాలండర్ రూపొందించి, నిర్ణీత సమయానికి పరీక్షల నిర్వహణతోపాటు విద్యార్థులను వివిధరకాల క్రీడల్లో కూడా ప్రోత్సహం అందించాలని అన్నారు. ఈ సమావేశంలో స్కూల్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ సెక్రెటరీ కోన శశిధర్, కమిషనర్ సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పాలనలో మార్పు స్పష్టంగా కనిపించాలి..

మొదటి సమీక్షలో భాగంగా రాష్ట్రంలో ఇసుక లభ్యత, నూతన ఇసుక పాలసీపై సిఎం సమీక్షించారు. 2014 నుంచి 2019 వరకు ఇసుక సరఫరాలో అమలు చేసిన పాలసీలను, ఆ తరువాత వైసీపీ ప్రభుత్వం తెచ్చిన విధానాలను అధికారులు వివరించారు. 2016లో తెచ్చిన ఉచిత ఇసుక పాలసీ వల్ల వచ్చిన ఫలితాలు...తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం పాలసీలు మార్చడం వల్ల జరిగిన నష్టాన్ని సిఎం దృష్టికి తెచ్చారు. గత ప్రభుత్వ విధానాలతో ఇసుక కొరత, ధరల భారంతో నిర్మాణ రంగం సంక్షోభాన్ని ఎదుర్కొందని అధికారులు వివరించారు. ఇసుక క్వారీల నిర్వహణలో పారదర్శకత లేకపోవడం, ప్రైవేటు వ్యక్తులు, ఏజెన్సీలకు ఇసుక క్వారీలను అప్పగించడంతో సరఫరా, అమ్మకాల్లో ఇబ్బందులు వచ్చాయని అధికారులు తెలిపారు. సీసీ కెమెరాలు, జీపీఎస్ ట్రాకింగ్, ఆన్ లైన్ విధానం సరిగా లేకపోవడం వల్ల అక్రమాలు జరిగాయని అధికారులు అన్నారు. ప్రైవేటు ఏజెన్సీలు ఎంత మేర తవ్వకాలు జరిపాయి, ఎంత మేర అమ్మకాలు జరిపాయనే విషయంలో కూడా నాడు ఎటువంటి పరిశీలన, పర్యవేక్షణ జరగలేదని తెలిపారు.అనంతరం సిఎం చంద్రబాబు మాట్లాడుతూ...తక్షణం నిర్మాణ రంగానికి అత్యవసరమైన ఇసుకను అందుబాటులోకి తేవడానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో నిర్మాణాలకు ఇసుక కొరత లేకుండా చూడాలని అన్నారు. ప్రస్తుతం స్టాక్ పాయింట్లలో అందుబాటులో ఉన్న ఇసుకను సరఫరా చేసేందుకు ఉన్న వెసులుబాటును చూడాలని సిఎం ఆదేశించారు. ఇసుక కొరత సమస్యను తీర్చడం, ధరలను నియంత్రించడంపై దృష్టిపెట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఇబ్బంది లేని విధంగా నూతన ఇసుక పాలసీని రూపొందించాలన్నారు. దీని కోసం సమగ్ర సమాచారం, ఆలోచనలతో రావాలని అధికారులకు సూచించారు. కూటమి ప్రభుత్వంలో ఇసుక విషయంలో ఎటువంటి అక్రమాలు, అవినీతికి అవకాశం లేని....ప్రజలకు ఇబ్బందులు కలిగించని పాలసీని తీసుకొస్తాం అన్నారు.

### రహదారుల దుస్థితిపై రెండో సమీక్ష

అనంతరం రాష్ట్రంలో రోడ్ల పరిస్థితిపై సిఎం సమీక్ష నిర్వహించారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా రోడ్లు దారుణంగా దెబ్బతిన్నాయని సిఎం అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పూర్తి స్థాయిలో రోడ్లను బాగు చేయడం ఒక విధానం అయితే...తక్షణం ప్రజల కష్టాలు తీర్చేందుకు రహదారులపై గుంతలు పూడ్చడం, వెంటనే మరమ్మతులు చేయాల్సిన రోడ్లపై ఫోకస్ పెట్టాలని సూచించారు. ఎన్ని కిలోమీటర్ల మేర రోడ్లు..ఏ మేర దెబ్బతిన్నాయి అనే విషయంలో సత్వరమే నివేదికలు సిద్ధం చేయాలన్నారు. రోడ్ల మరమ్మతులకు సంబంధించి సాంకేతికంగా అందుబాటులోకి వచ్చిన కొత్త విధానాలపై అధ్యయనం చేయాలని సూచించారు. ప్రస్తుతం వర్షాలు పడుతున్నప్పటికీ వెంటనే మరమ్మతులు చేయాల్సిన రోడ్లపై ప్రణాళికను రూపొందించాలని సూచించారు. ఆర్థిక సమస్యలు ఉన్నా...ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని రోడ్ల మరమ్మతులకు ప్రాధాన్యం ఇస్తామని సిఎం అన్నారు.

నిత్యవసర సరుకుల భారం తగ్గించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను సిఎం చంద్రబాబు ఆదేశించారు. రాష్ట్రంలో ప్రస్తుతం నిత్యావసర సరుకుల ధరలపై వ్యవసాయ శాఖ, మార్కెటింగ్ శాఖ, సివిల్ సప్లై శాఖ అధికారులు, మంత్రులతో సమీక్ష చేశారు. బియ్యం, కందిపప్పు, టమోటా, ఉల్లి ధరల నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై సమీక్ష చేశారు. డిమాండ్ కు సరిపడా సరఫరా లేక కంది పప్పు ధర అంతకంతకూ పెరుగుతోందని అధికారులు తెలిపారు. అలాగే టమోటా, ఉల్లిపాయల ధరలు ఒక్కోసారి అనూహ్యంగా పెరగడం వల్ల ప్రజలపై భారం పడుతోందని అధికారులు వెల్లడించారు. ధరల నియంత్రణకు ఏ చర్యలు తీసుకోవాలనేదానిపై ప్రణాళికతో రావాలని సిఎం సూచించారు. నిత్యవసర వస్తువుల ధరల నియంత్రణకు ఆయా సరుకుల దిగుమతుల కోసం అవసరమైన చోట కేంద్రంతో కూడా సంప్రదింపులు జరుపుదామని సీఎం అన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం 122 రైతు బజార్ లు ఉన్నాయని అధికారులు చెప్పగా....వాటి నిర్వహణ సరిగా లేక వాటి ఏర్పాటు వెనుక ఉన్న ఉద్దేశం నెరవేరడం లేదని సిఎం చంద్రబాబు అన్నారు. ఈ మూడు సమీక్షలలో మంత్రులు కొల్లు రవీంద్ర, బీసీ జనార్థన్ రెడ్డి, కె.అచ్చెన్నాయుడు, నాదెండ్ల మనోహర్ తో పాటు ఆయా శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# అందుకే వైసీపీ ఓడిపోయింది

## : సీపీఐ నారాయణ

**రాజకీయాల్లో స్పష్టమైన వైఖరి అవసరమన్న నారాయణ**
**అది లేకపోవడం వల్లే ఎన్నికల్లో వైసీపీ ఓడిపోయిందని వ్యాఖ్య**



**ఆంధ్ర ప్రగతి అమరావతి జులై 02:** రాజకీయాల్లో స్పష్టమైన వైఖరి అవసరమని, అది లేకపోవడం వల్లే ఎన్నికల్లో వైసీపీ ఓడిపోయిందని సీపీఐ నారాయణ అన్నారు. బీజేపీతో ఉంటే ఉన్నామని, లేకపోతే లేమని జగన్ స్పష్టంగా చెప్పలేకపోయారన్నారు. ఆయన న్యూట్రల్ స్టాండ్ తీసుకోవడంతో తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. అసెంబ్లీలో సీట్ల సంఖ్యను బట్టి ప్రతిపక్ష హోదా ఉంటుందని, అంతే తప్ప ఓట్ల శాతం ఆధారంగా కాదని తెలిపారు. కేవలం సంక్షేమ పథకాలు మాత్రమే ఇస్తే సరిపోదని, రాష్ట్రాన్ని అభివృద్ధి చేయకపోవడం వల్లే వైసీపీ 11 స్థానాలకు పరిమితమైందని నారాయణ వ్యాఖ్యానించారు. ఇక న్యూట్రల్ స్టాండ్ వల్ల జగన్ మాత్రమే కాదని కేసీఆర్, నవీన్ పట్నాయక్ కూడా తీవ్రంగా నష్టపోయారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. కేంద్రంలోని బీజేపీతో కలిసి వెళ్లాలనే చంద్రబాబు, పవన్ కల్యాణ్ నిర్ణయం వాళ్ల వరకూ కరెక్టేనని నారాయణ అన్నారు. కాగా, టీడీపీ కూటమిలో పవన్ డైనమిక్ పాత్ర పోషించారన్నారు. ఆయనకు ఉన్న సినిమా చరిష్మా ఎన్నికల్లో ప్లస్ అయిందన్నారు. అందుకే పోటీ చేసిన అన్నిచోట్ల జనసేన గెలిచిందని తెలిపారు.

ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల ఫలితాలపై సమీక్ష నిర్వహించామని చెప్పిన ఆయన.. జగన్ హయాంలో ప్రజాస్వామ్యం దెబ్బతిందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా దుమారం రేపుతున్న రుషికొండ భవనాల నిర్మాణంపై కూడా నారాయణ స్పందించారు. ఈ భవనాలను నిర్మించేటప్పుడు ప్రతిపక్ష నేతలను వైసీపీ ప్రభుత్వం అక్కడకు వెళ్లనీయలేదన్నారు. ఈ భవనాల్ని కూటమి ప్రభుత్వం ప్రజాప్రయోజనాల కోసం ఉపయోగించాలని నారాయణ సూచించారు.

# వైసీపీ పాలనలో గ్రామాల అభివృద్ధి నిధులు దారిమళ్లింపు.!

**.ఆంధ్ర ప్రగతి అమరావతి జూలై 02:**
'గత ప్రభుత్వ పాలనలో పంచాయతీలన్నీ నిధుల లేమితో అల్లాడాయి. పంచాయతీలకు రావాల్సిన నిధులు వాటికి సక్రమంగా రాకపోవడం ఒక ఎత్తయితే, ధర్మంగా పంచాయతీలకు చెందాల్సిన వాటాలను సైతం ఇవ్వలేదు. గ్రామాల నుంచి నిధులు మళ్ళించారు తప్ప పైసా ఇచ్చింది లేదు. మరోపక్క పంచాయతీలకు కేంద్రం నుంచి రావాల్సిన ఆర్థిక సంఘం నిధుల్ని కూడా దారి మళ్లించారు. ఫలితంగా పంచాయతీలు పూర్తిగా నిర్వీర్యం అయ్యే పరిస్థితి వచ్చింద'ని ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీలకు వివిధ శాఖల నుంచి రావాల్సిన వాటాలను కూడా గత అయిదేళ్లుగా ఇవ్వలేదని చెప్పారు. ఇసుక సీనరేజీ, గనుల సీనరేజీ, రిజిస్ట్రేషన్ వాటాలు, లేబర్ పన్నుల వాటా అలాగే ఇతర శాఖల నుంచి కూడా పంచాయతీలకు చట్టపరంగా రావాల్సిన ఏ నిధులు గత పాలనలో అందలేదన్నారు. పంచాయతీ రాజ్ సమీక్షలు చేస్తున్నప్పుడు అధికారులు చెబుతున్న మాటలు వింటే పాలనపై గత ప్రభుత్వ నిర్లక్ష్యం చూసి వేదన కలుగుతుందన్నారు దీనిపై క్యాబినెట్ హై లెవెల్ కమిటీ ఏర్పాటు చేసి, పంచాయతీలకు రావల్సిన నిధులపై దృష్టి పెడతామన్నారు. కాకినాడ కలెక్టరేట్ లో మంగళవారం జిల్లా అధికారులతో వివిధ శాఖలపై సమీక్షలను ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేశారు. జిల్లా కలెక్టర్ శ్రీ షన్మోహన్ సగిలి ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులు సమీక్షలకు హాజరయ్యారు. సుమారు నాలుగు గంటలపాటు శ్రీ పవన్ కళ్యాణ్ గారు తన పరిధిలోని శాఖలపై విడివిడిగా సమీక్షించారు. సమీక్ష అనంతరం పవన్ కళ్యాణ్ మీడియాతో మాట్లాడారు.

ఈ సందర్భంగా శ్రీ పవన్ కళ్యాణ్ గారు మాట్లాడుతూ “పంచాయతీలకు నిధులు అందకపోతే పనులు చేసేందుకు అవకాశం ఉండదు. కొన్ని పంచాయతీలు కార్యాలయ నిర్వహణ కూడా భారంగా మారిన పరిస్థితులు ఉన్నాయి. నిబంధనల ప్రకారం పంచాయతీలకు ఆయా పంచాయతీల్లోని జనాభాను అనుసరించి రాష్ట్ర ప్రభుత్వం నిధులు అందించాలి. అలాగే వివిధ శాఖలువారిగా వాటాలను స్థానిక పంచాయతీలకు ఇవ్వాల్సి ఉంటుంది. ఈ నిధులతోపాటు కేంద్రం నిధులు, సాధారణ నిధులు పంచాయతీలను అభివృద్ధి పథంలో నడుపుతాయి. గత వైసీపీ పాలనలో పంచాయతీలకు ఏ వైపు నుంచి నిధులు రాలేదు. ఫలితంగా గ్రామాభివృద్ధి పూర్తిగా కుంటుపడిపోయింది. కనీసం ప్రజల నుంచి ఎన్నికయిన వారికి అధికారాలను దూరం చేశారు.

ఒక్క తూర్పు గోదావరి నుంచే ఇసుకపై ఏటా రూ. వెయ్యి కోట్ల ఆదాయం
గోదావరి తీర ప్రాంతం ఎక్కువగా ఉంటే తూర్పు గోదావరి జిల్లాలో ఒక్క ఇసుక అమ్మకం ద్వారానే ఏటా రూ.వెయ్యి కోట్ల ఆదాయం ప్రభుత్వ ఖజానాకు వస్తోంది. దీనిలో పంచాయతీలకు ఇసుక సీనరేజ్ వాటా ఇవ్వాలి. అది ఎక్కడా దక్కలేదు. రాష్ట్రంలో ఏ పంచాయతీకి కూడా రావాల్సిన వాటాలు అందలేదు. దీంతో మొత్తం వ్యవస్థ నాశనం అయ్యే పరిస్థితి వచ్చింది. అధికారులను దీనిపై పూర్తి స్థాయి నివేదిక సిద్ధం చేయమని ఇప్పటికే ఆదేశించాను. పంచాయతీలకు ఏ శాఖ నుంచి ఏ తరహా వాటాలు అందాల్సి ఉంటుంది. వాటి వసూలు పక్కాగా జరగడానికి ఏం చేయాలి అన్న విషయాలపై నివేదిక ఇవ్వాలని కోరారు. మొదట పంచాయతీ వ్యవస్థ బలోపేతం చేయాలి. ఆర్థికంగానూ ముందుకు తీసుకెళ్లాలి. పంచాయతీలకు ఆర్థిక పరిపుష్టి అవసరం. అప్పుడే గ్రామాల్లో అనుకున్న పనులు జరుగుతాయి. దీని కోసం కూటమి ప్రభుత్వం దృష్టి పెడుతుంది. పంచాయతీలకు న్యాయబద్ధంగా అందాల్సిన నిధులు, వాటాలు తీసుకువచ్చేలా చూస్తాం. వైసీపీ హయాంలో గ్రామాల నుంచి సహజ సంపదలు దోచుకున్నారు తప్పితే పంచాయతీలకు రూపాయి విదల్చలేదు.

గత ప్రభుత్వంలో కేంద్రం నుంచి వచ్చే జల్ జీవన్ మిషన్ నిధులకు మ్యాచింగ్ గ్రాంట్లు ఇవ్వలేదు. ఫలితంగా నిధులు ఆగిపోయాయి. జల్ జీవన్ మిషన్ నిధులతో ప్రతి గ్రామానికి, ప్రతి ఇంటికీ సురక్షిత మంచి నీరు అందించేందుకు అవసరం అయిన నిధులు ఉన్నాయి. నిధుల లభ్యత, మ్యాచింగ్ గ్రాంట్లకు ఎంత ఇవ్వాలి అనే విషయాలపై చర్చిస్తాం. రాష్ట్రంలో ప్రతి ఇంటికీ రక్షిత తాగు నీరు అందించాలన్న లక్ష్యంతో ముందుకు వెళ్తున్నాం. దీనిపై ఓ ప్రణాళికతో ముందడుగు వేస్తాం. సమీక్షలు చేస్తున్నపుడు జల్ జీవన్ మిషన్ ను ఉపయోగించుకొని రాష్ట్రంలోని ప్రతి ఇంటికి రక్షిత మంచి నీరు అందించే అవకాశం ఉందని తెలుస్తోంది. దీనిపై మరింత దృష్టి పెడతాం.

కాకినాడకు తలమానికంగా ఉన్న హోప్ ఐల్యాండ్ ను ఏకో టూరిజం పార్కుగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం. ఇక్కడ అరుదైన జంతుజాలం ఉంది. వాటికి హాని కలగకుండా హోప్ ఐల్యాండ్ ను అభివృద్ధి చేస్తాం. పర్యాటక శాఖ సహాయంతో హోప్ ఐ ల్యాండ్ అద్భుతమైన ప్రాంతంగా తీర్చిదిద్దుతాం. అలాగే కోరింగ ఏకో పార్కును పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి పర్యాటక కేంద్రంగా తయారు చేస్తాం. కాకినాడ స్మార్ట్ సిటీకి సంబంధించిన నిధులు, అభివృద్ధి పనుల బాధ్యతను ఎంపీ శ్రీ ఉదయ్ శ్రీనివాస్ కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులతో మాట్లాడతారు. కాకినాడను అభివృద్ధి దిశగా ముందుకు నడిపిస్తాం. స్మార్ట్ సిటీ నిధులపై ఎప్పటికప్పుడు సమీక్ష చేసి పనులు పూర్తయ్యేలా చూస్తాం.

ప్రపంచీకరణ కారణంగా వాతావరణంలో ఎప్పటికప్పుడు మార్పులు వస్తున్నాయి. వాతావరణంలో వచ్చే విపరీతమైన మార్పుల వల్ల ఏటా సముద్ర తీరం ముందుకు వస్తోంది. ఉప్పాడలో ఏటా 20 అడుగుల మేర సముద్రం ముందుకు రావడం వాతావరణంలో కలుగుతున్న మార్పులకు సంకేతం. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పరిశ్రమల కాలుష్యంపై పూర్తి నివేదిక ఇవ్వాలని అధికారులకు సూచించాం. వాతావరణంలో కర్బన ఉద్గారాలను తగ్గించే విధంగా చూడాలి. పరిశ్రమలు, కాలుష్యాన్ని తగ్గించడానికి ఉన్న అవకాశాలను పరిశీలించి తగు విధమైన సూచనలు చేస్తాం. రాష్ట్రవ్యాప్తంగా నాలుగు జిల్లాలలో కాలుష్యం అధికంగా ఉందని ప్రాథమిక నివేదిక వచ్చింది. పర్యావరణ శాఖపై పూర్తి స్తాయి దృష్టి సారిస్తాం. కాలుష్యం తగ్గించే పరిశ్రమలను ప్రోత్సహిస్తాం.

సముద్ర తీరాన్ని రక్షించే మడ అడవులు రక్షించుకోవడం అందరి బాధ్యత. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మడ అడవుల్ని నరికేసి అక్కడ ఇళ్ల పట్టాలు ఇచ్చారు. అలాగే హానికారకమైన మలేషియన్ బ్రీడ్ రకం కోనో కార్పస్ రకం మొక్కలను పచ్చదనం కోసం పెంచారు. వాటి తొలగింపుపై దృష్టి పెట్టి విడతలవారీగా తొలగిస్తాం. కాలుష్య నిబంధనలు లోబడి పరిశ్రమలు ఎలా పని చేయాలి? దానిలో ఎలా భాగస్వాముల్ని చేయాలనే దానిపై దృష్టి పెడతాం. సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖలో, అటవీ శాఖలో చాలా ఖాళీలు ఉన్నాయి. దీనిపై దృష్టిపెడతాం. ఎవరికీ అధిక పనిభారం ఉండకూడదన్నది నా అభిమతం. అయితే నిధులు, ఉద్యోగాల భర్తీని అనుసరించి వాటిని భర్తీ చేయడానికి ప్రయత్నిస్తాం. ముఖ్యంగా సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖలో పిల్లలకు భవిష్యత్తు ఇన్నోవేషన్స్ గురించి ప్రత్యేకంగా ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని చెప్పాం. భావి శాస్త్ర వేత్తలను తయారు చేయాల్సిన అవసరం ఉంది. రాజమండ్రిలో ప్రాంతీయ విజ్ఞాన కేంద్రం ప్రారంభానికి సన్నాహాలు చేస్తున్నాం.అలాగే కోతకు గురయిన ఉప్పాడ తీర ప్రాంతం పరిశీలనకు రేపు వెళ్తాను. దీని కోసం ప్రత్యేకంగా నిపుణుల బృందం కూడా రానుంది. చెన్నై నుంచి ప్రత్యేక నిపుణులు రానున్నారు.

గత ప్రభుత్వంలో 30 వేల మంది ఆడపడుచులు అదృశ్యం అయ్యారని నేను చెప్పినా అప్పటి ప్రభుత్వం కనీసం సమీక్ష కూడా చేయలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత బీమవరానికి చెందిన ఓ తల్లిదండ్రులు తమ బిడ్డ మైనర్ అని.. ప్రేమ పేరిట తీసుకువెళ్లిపోయారని పోలీసులకు చెప్పినా పట్టించుకోలేదని నా దృష్టికి తీసుకొచ్చారు. ఆ విషయం మా దృష్టికి వచ్చిన వెంటనే విజయవాడ కమిషనర్, మాచవరం సీఐ గార్లతో మాట్లాడితే 72 గంటల్లోపే బాలిక ఎక్కడ ఉందో కనిపెట్టి తీసుకువస్తున్నారు. దీనికి పోలీసు శాఖకు అభినందనలు. ఓ తల్లి వేదనను.. గుండెతో వింటే తప్పనిసరిగా పరిష్కారం దొరుకుతుంది. ఇది గత ప్రభుత్వానికి లేదు. కనీసం ఆడబిడ్డలు అదృశ్యమయ్యారని చెబితే ఓ ప్రెస్ మీట్ కూడా పెట్టలేదు. రాష్ట్రంలో అదృశ్యం అవుతున్న ఆడబిడ్డల కోసం ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలి. దీనిని కేబినెట్ లో పెడతాం. ఒక ఆడబిడ్డ అదృశ్యం అయితే వెంటనే తల్లిదండ్రులు స్పందించాలి. 24 గంటలు దాటితే పట్టుకోవడం కష్టం. 48 గంటలు దాటితో ఆశలు వదులుకోవాలని పోలీసులే చెబుతున్నారు. కాబట్టి అదృశ్యం అయిన వెంటనే స్పందించేలా ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసేలా ఆలోచన చేస్తాం. రాష్ట్రంలో శాంతి భద్రతలు బలంగా ఉంటే రాష్ట్రానికి పెట్టుబడులు వస్తాయి. పెట్టుబడులు వస్తే రాష్ట్రానికి ఆదాయం పెరుగుతుంది. కేంద్రం వద్ద పలు శాఖలకు సంబంధించి అద్భుతమైన పథకాలు ఉన్నాయి. ప్రసాద్ స్కీం సహాయంతో ఆధ్యాత్మిక పర్యాటకాన్ని అభివృద్ధి చేయొచ్చు. రాష్ట్రంలో అగ్రికల్చర్ టూరిజం అభివృద్ధి చేసేందుకు కూడా అవకాశాలు ఉన్నాయి. దీనిని కూడా మేము పరిశీలిస్తాం” అని అన్నారు.

ఈ సమావేశంలో కాకినాడ ఎంపీ శ్రీ తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్, ఎమ్మెల్యేలు శ్రీ వనమాడి వెంకటేశ్వరరావు, శ్రీ పంతం నానాజీ, శ్రీమతి వరుపుల సత్యప్రభ, శ్రీ జ్యోతుల నెహ్రూ, ఎస్పీ ఎస్.సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## హోమియోపతి పితామహుడు
# శామ్యూల్ హానిమన్ సేవలు చిరస్మరణీయం

**-సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫీ.**



ఆంధ్ర ప్రగతి డోన్ జూన్ 02:
జులై 2 న హోమియోపతి పితామహుడు శామ్యూల్ హానిమన్ వర్ధంతి సందర్భంగాడోన్ పట్టణం లో సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి ఆధ్వర్యం హోమియోపతి పితామహుడు శామ్యూల్ హానిమన్ వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాల వేసి ఘణంగా నివాళులు అర్పించారు.వారిని స్మరించుకున్నారు.ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త పి. మహమ్మద్ రఫి మాట్లాడుతూమన దేశ స్వాతంత్ర్య సమరయోధులను, శాస్త్రవేత్తలను ,మహనీయులను, సమాజానికి సేవలు అందించిన ప్రతి ఒక్కరిని స్మరించుకుంటూ వారి అడుగుజాడల్లో నడవాలని సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి కోరారు.హోమియోపతి పితామహుడు శామ్యూల్ హానిమన్ గారు 10-4-1755 న జన్మించారు. ఈయన జర్మనీకి చెందిన వైద్యుడు.వైద్య చరిత్రలో ప్రత్యామ్నాయ వైద్యమైన హోమియో విధానాన్ని ప్రపంచానికి పరిచయం చేశాడు. అమూల్యమైన హోమియో వైద్య విధానాన్ని భవిష్యత్ తరాలకు అందించడం కోసం తమ శరీరాలనే ప్రయోగశాలలుగా చేసుకొని మందులను తమపైనే ప్రయోగించుకొని రుజువుపరచి గ్రంథస్తం చేసిన డాక్టర్ హానిమన్, ఆయన శిష్యులను మానవజాతి ఎన్నటికీ మరువదు. డాక్టర్ హానిమన్ తన 88 వ ఏట 1843 జులై 2 వ తేదీన తుదిశ్వాస వదిలారు. సమాజానికి సేవలు అందించిన మహనీయులను అనుక్షణం స్మరించుకోవాలని సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి కోరారు.

# కొత్త నేర చట్టాల అమలును వాయిదా వేయాలి: సిపిఐ

ఆంధ్ర ప్రగతి నంద్యాల జులై 02:
కేంద్రము లోని బిజెపి ప్రభుత్వము ఏకపక్షంగా దేశ వ్యాప్తంగా కొత్త నేర చట్టాలను అమలు చేయాలని నిర్ణయాన్ని వాయిదా వేయాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కే రామాంజనేయులు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు డిమాండ్ చేశారు.

సిపిఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం జరిగింది ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కే రామాంజనేయులు సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్ రంగనాయుడు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ బాబా ఫక్రుద్దీన్.సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు. ఏఐటీయూసీ. జిల్లా ప్రధాన కార్యదర్శి.పి. సుంకయ్య. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు.కే. రాధాకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.రామాంజనేయులు సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్. రంగనాయుడు మాట్లాడుతూ..

దేశంలో బిజెపి ప్రభుత్వం అధికారం లోకి వచ్చాక కొత్త కొత్త చట్టాలను ప్రతిపక్షం లేదని ఏకపక్షంగా ప్రజా వ్యతిరేక చట్టాలను తేవడం జరిగిందని అందులో భాగంగానే పార్లమెంటులో కొత్త చట్టం వ్యతిరేకంగా 140 పార్లమెంట్ సభ్యులను బలవంతంగా మార్చల్ చేత బయటికి పంపించి



ఇండియన్ పీనల్ కోడ్ (ఐపిసి) స్థానంలో భారత న్యాయ సంహిత చట్టాన్ని. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ స్థానంలో భారత నాగరిక్ సురక్ష సంహిత చట్టాన్ని. ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ (ఐఈ ఏ ) స్థానంలో భారతీయ సాక్ష అది నీయం చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకోని రావడం దుర్మార్గమని అన్నారు.దేశంలో జులై 1వ తేది న కొత్త నేర చట్టాలు అమలు అయ్యిందో లేదో అప్పుడే ఢిల్లీలోని ఒక వీధి వ్యాపారి రోడ్డుపై వాటర్ బాటిల్ సిగరెట్టు అమ్మడాన్ని పెట్రోలింగ్ పోలీసులు గుర్తించడంతో అమాయక వీధి వ్యాపారిపై కేసు నమోదు కావడం జరిగిందని నూతన మూడు చట్టాల వల్ల ప్రజలు పోలీస్ కష్టాలను తొలగించే అధికారం పోలీసులకు ఉందని ఇది న్యాయ శాస్త్రానికి సంబంధించిన ప్రాథమిక సూత్రాలకు విరుద్ధమని చట్టంలో ఇంకా పూర్తిగా అమలు చేయని ఇతర నిబంధనలు అనేకం ఉన్నాయని ఇది బిజెపి పార్టీ అధికార దుర్వినియోగం దురహంకారమని కొత్త చట్టాలను సమీక్షించేంతవరకు అమలు చేయకుండా ఆపాలని పై నాయకులు డిమాండ్ చేశారు.

# ధార్మిక వ్యాప్తి ద్వారానే సమాజంలో శాంతి సుస్థిరతలు.

**-డాక్టర్ మల్లు వేంకటరెడ్డి, తితిదే.**



ఆంధ్ర ప్రగతి గోస్పాడు జూలై 02:
ధార్మిక వ్యాప్తి ద్వారానే సమాజంలో శాంతి సుస్థిరతలు నెలకొంటాయని, ధర్మ రక్షణ ప్రతి మానవుని కర్తవ్యమని, ధర్మాన్ని మనం పాటించినపుడే మనకు తద్వారా దైవానుగ్రహం కలుగుతుందని తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో మండల కేంద్రమైన గోస్పాడు నందు వెలసిన శ్రీ సోమనందీశ్వర స్వామి దేవస్థానం నందు మంగళవారం నాలుగు రోజుల ధార్మిక కార్యక్రమాలను ప్రారంభం సందర్భంగా వారు ప్రారంభోపన్యాసం చేశారు. ఈ సందర్భంగా ఇస్కాన్ ధర్మ ప్రచారకులు నిత్యతృప్తదాస్ శ్రీమద్రామాయణం - జగతికి ఆదర్శం అనే అంశంపై సుదీర్ఘంగా ప్రవచించారు. ఈ కార్యక్రమంలో శ్రీసోమ నందీశ్వర స్వామి దేవస్థానం వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీకంఠ నందీశ్వర శర్మ, గ్రామ సర్పంచ్ పరదేశి ప్రమీల బాలన్న, గ్రామవికాస భారతి నంద్యాల జిల్లా అధ్యక్షులు చిలంకూరి నాగరాజేశ్ కుమార్ రెడ్డి, అర్చకులు చింతకుంట సురేశ్ శర్మ, కె.చిన్నగురప్ప, డొల్లు తిమ్మయ్య, కె.సుబ్బరాయుడు, జి.కృష్ణుడుతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# మహానంది చైర్మన్ గిరి పై బీసీల చూపు

**ఆంధ్ర ప్రగతి మహానంది జులై 02:**
మహానంది దేవస్థానం చైర్మన్ గిరి పై బీసీల చూపు పడినట్లు విశ్వాసనీయ సమాచారం. దాదాపు కొన్ని సంవత్సరాలు నుండి మహానంది దేవస్థానం చైర్మన్ పదవి దాదాపు 99% పైనే ఓసి వర్గానికి చెందిన వ్యక్తులే చైర్మన్ పదవులు పొందారు . మాజీ మున్సిపల్ చైర్మన్ పాణ్యం రామయ్య, కంచర్ల సురేష్ రెడ్డి, భరద్వాజ శర్మ, నాగ భూపాల్ రెడ్డి, గోపాల్ రెడ్డి, పాణ్యం ప్రసాదరావు, రామకృష్ణారెడ్డి ,పాల మహేశ్వర్ రెడ్డి తదితర ఓసి వర్గానికి చెందిన వారే చైర్మన్ గా వ్యవహరించారు. ప్రస్తుత రాజకీయ పరిణామాల నేపథ్యంలో మహానంది దేవస్థానం చైర్మన్ గిరి బీసీలకు కేటాయించాలని పలువురు కోరుతున్నట్లు తెలుస్తుంది. ప్రస్తుతం టిడిపి అధికారంలోనికి రాగా పార్టీ ప్రారంభం నుండి నేటి వరకు ఎన్నో కష్టనష్టాలు ఓర్చి ఎవరు పార్టీ మారినా మారకున్నా ఎమ్మెల్యే కానీ ఎంపీ కానీ స్థాయి వారు కూడా పార్టీలు మారిన మారకున్న ఎన్ని ఇబ్బందులు కలగజేసిన తాము పార్టీ మారలేదు. అందులో భాగంగానే బీసీలమైన మాకు మహానంది దేవస్థానం చైర్మన్ పదవి



కట్టబెట్టాలని మండలంలోని గోపవరం గ్రామానికి చెందిన ఒక వర్గం వాదిస్తున్నట్లు తెలుస్తుంది. అధిష్టానం దృష్టిలో కూడా ఈ విషయం ఉన్నట్లు తెలుస్తుంది దీంతోపాటు నిరంతరం మహానంది క్షేత్రంలో జరిగే నిత్య అన్న ప్రసాద వితరణ కార్యక్రమానికి నిరంతరం ప్రతిరోజు అన్నప్రసాద వితరణ కార్యక్రమానికి ఉచితంగా కూరగాయలు మరియు క్షేత్రంలో జరిగే వివిధ పూజా కార్యక్రమాలు అభివృద్ధి కార్యక్రమాల్లో దాతగా వ్యవహరిస్తున్న నంద్యాలకు చెందిన ప్రముఖ కూరగాయల వ్యాపారి ఒకరు మహానంది దేవస్థానం చైర్మన్ పదవి కోసం పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తుంది. ఓసి వర్గానికి చెందిన వ్యక్తులు కూడా తమ వంతు ప్రయత్నాలు ముమ్మరం చేస్తూ మహానంది దేవస్థానం చైర్మన్ పదవి బీసీలకు కాకుండా ఓ సి వర్గానికి చెందిన విధంగా పావులు కదుపుతున్నట్లు విశ్వాసనీయ వర్గాల సమాచారం. ఒక్కసారైనా బీసీలకు మహానంది దేవస్థానం చైర్మన్ పదవి కట్ట పెట్టకపోతారా లేక యధా రాజా తథా ప్రజా అన్న విధంగా ఓసిలకే కేటాయిస్తారా అన్నది తేలాల్సి ఉంది. ఆలయ అభివృద్ధి కోసం పాటుపడే వ్యక్తులకే చైర్మన్ పదవి కట్టబెడితే ఫలితం ఉంటుందని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తుంది. ఏది ఏమైనా స్థానిక నియోజకవర్గ ప్రజా ప్రతినిధి ఎవరికి ప్రాధాన్యం ఇస్తారు అనేది వారి నిర్ణయం పై ఆధారపడి ఉందని సమాచారం.

# లోక్ సభలో చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు..
# తృణమూల్ ఎంపీ బెనర్జీపై టీడీపీ ఎంపీ బైరెడ్డి శబరి ఫైర్!

**లోక్ సభలోకి మోదీ రెండు ఊతకర్రలతో అడుగుపెట్టారన్న కల్యాణ్ బెనర్జీ**
**ఒక ఊతకర్ర చంద్రబాబు, మరో ఊతకర్ర నితీశ్ కుమార్ అంటూ ఎద్దేవా**
**చంద్రబాబును ఈడీ, సీబీఐ అరెస్ట్ చేశాయంటూ వ్యాఖ్యలు**
**కల్యాణ్ బెనర్జీ వ్యాఖ్యలను ఖండించిన బైరెడ్డి శబరి**

**ఆంధ్ర ప్రగతి ఢిల్లీ జులై 02:**
చంద్రబాబు ఊతకర్ర కాదని, ఖడ్గం అని స్పష్టీకరణ లోక్ సభ సమావేశాల్లో నేడు ఆసక్తికర ఘట్టం చోటుచేసుకుంది. ఏపీ సీఎం చంద్రబాబుపై లోక్ సభలో తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ కల్యాణ్ బెనర్జీ అనుచిత వ్యాఖ్యలు చేశారు. కల్యాణ్ బెనర్జీ మాట్లాడుతూ... మోదీ సర్కారు ఇవాళ లోక్ సభలోకి రెండు ఊతకర్రల సాయంతో అడుగుపెట్టిందని ఎద్దేవా చేశారు. ఒక ఊతకర్ర నితీశ్ కుమార్ పార్టీ, రెండో ఊతకర్ర నాయుడు బాబు (చంద్రబాబు) పార్టీ అంటూ వ్యంగ్యం ప్రదర్శించారు. చంద్రబాబు విషయంలో గతంలో ఏం జరిగిందో అందరికీ తెలుసు... సీబీఐ, ఈడీ ఆయనను అరెస్ట్ చేశాయి కదా! అంటూ చంద్రబాబుపై విమర్శనాత్మక వ్యాఖ్యలు చేశారు. అయితే, కల్యాణ్ బెనర్జీ వ్యాఖ్యలను లోక్ సభలోనే ఉన్న టీడీపీ ఎంపీ బైరెడ్డి శబరి తీవ్రంగా తప్పుబట్టారు.



తమ నాయకుడు చంద్రబాబుపై టీఎంసీ ఎంపీ చేస్తున్న వ్యాఖ్యలు సరికాదని ఖండించారు. కల్యాణ్ బెనర్జీ వ్యాఖ్యలను లోక్ సభను తప్పుదోవ పట్టించేలా ఉన్నాయని బైరెడ్డి శబరి విమర్శించారు. సీబీఐ, ఈడీ చంద్రబాబును అరెస్ట్ చేశాయి అంటూ తప్పుడు వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. అపారమైన విషయ పరిజ్ఞానం ఉన్న సీనియర్ సభ్యుడు కల్యాణ్ బెనర్జీ ఇలా మాట్లాడడం బాధాకరమని పేర్కొన్నారు. చంద్రబాబును అరెస్ట్ చేసింది ఏపీ సీఐడీ అనే విషయాన్ని గౌరవనీయ తృణమూల్ సభ్యుడు గుర్తించాలని చురక అంటించారు. అది కూడా నేను ప్రాతినిధ్యం వహిస్తున్న నంద్యాల పార్లమెంటు స్థానంలోనే ఆయనను అరెస్ట్ చేశారు అని శబరి సభకు వివరించారు. అంతేకాదు, చంద్రబాబును కల్యాణ్ బెనర్జీ ఓ ఊతకర్రతో పోల్చుతున్నారని, చంద్రబాబు ఊతకర్ర కాదని, పదునెక్కిన ఖడ్గం అని స్పష్టం చేశారు. హైదరాబాద్ అభివృద్ధి, ఐటీ విప్లవం ఎవరి వల్ల సాకారం అయ్యాయో కల్యాణ్ బెనర్జీ ఓసారి చరిత్ర చూసుకోవాలని హితవు పలికారు.



# వైఎస్ జయంతి వేడుకలకు సోనియా, రాహుల్‌గాంధీ

## పీసీసీ అధ్యక్షురాలు షర్మిల వెల్లడి





షర్మిలను సత్కరిస్తున్న తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి

**ఆంధ్ర ప్రగతి అమరావతి జులై 02:**
విజయవాడలో ఈ నెల 8న నిర్వహించే దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 75వ జయంతి వేడుకలకు కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సీనియర్ నేత సోనియాగాంధీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, ఇతర ఏఐసీసీ పెద్దలు, ఏపీ, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నాయకులు హాజరవుతున్నట్లు ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల తెలిపారు. మంగళవారం ఆమె తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఇతర మంత్రులను హైదరాబాద్‌లో వేర్వేరుగా కలిసి ఆహ్వానించారు. సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు గిడుగు రుద్రరాజు కన్వీనర్‌గా వేడుకల నిర్వహణకు ఎనిమిది మంది కాంగ్రెస్ సీనియర్ నేతలతో కమిటీ ఏర్పాటు చేశారు.

# డయాఫ్రం వాల్‌కు ప్రమాదం ఏమీలేదు

## మూడో రోజూ పోలవరంలో విదేశీ సాంకేతిక బృందం..

**ఆంధ్ర ప్రగతి పోలవరం జులై 02:**
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న పోలవరం ప్రాజెక్టు నిర్మాణంపై మళ్లీ ఫోకస్ పెడుతోంది.. అందులో భాగంగా..
ప్రాజెక్టులో ఉన్న ఇబ్బందులను అధిగమించే ప్రయత్నాలు చేస్తోంది.. దీనికోసం విదేశీ నిపుణులను రంగంలోకి దింపింది.. ఇక, ఏలూరు జిల్లా పోలవరం ప్రాజెక్టు ప్రాంతంలో విదేశీ నిపుణుల బృందం మూడో రోజైన నేడు కూడా వారి పర్యటన కొనసాగుతుంది.
ప్రాజెక్టు నిర్మాణంలో ఏర్పడుతున్న సాంకేతిక సమస్యలకు పరిష్కారం చూపేందుకు రెండు రోజుల నుంచి విదేశీ నిపుణుల బృందం పోలవరం ప్రాజెక్టు నిర్మాణ ప్రాంతంలో పర్యటిస్తోంది. గత రెండు రోజులపాటు పోలవరం ప్రాజెక్టులోని కీలక నిర్మాణాలను పరిశీలించిన బృందం మూడవ రోజు ఏలూరు జిల్లా పోలవరం ప్రాజెక్టు నిర్మాణ ప్రాంతంలో అంతర్జాతీయ నిపుణులబృందం మూడో రోజు డీ వాల్ నిర్మాణ ప్రాంతంలో సేకరించిన మట్టిని రాతిని పరిశీలించారు. మరిన్ని నమూనాల పరిశీలన అనంతరం జలవనరుల శాఖ అధికారులతో నిపుణుల బృందం చర్చించనుంది.
ఇక పోలవరం ప్రాజెక్టు పరిస్థితిని సమీక్షించేందుకు వచ్చిన అంతర్జాతీయ నిపుణులు అనేక అంశాలు ప్రస్తావించారు. వాటిపై అక్కడ ఉన్న కేంద్ర జలసంఘం నిపుణులు, అఫ్రి డిజైన్ సంస్థ ప్రతినిధులు, స్థానిక ఇంజినీరింగ్ అధికారులు, ఇతర సంస్థల ప్రతినిధులు ఇచ్చే సమాధానాలు వింటూ వారి అనుమానాలను నివృత్తి చేస్తూ ముందుకు సాగుతున్నారు. అలాగే , ఈరోజు, రేపు ప్రాజెక్టు పనులకు సంబంధించి పలు వివరాలు సేకరించిన అనంతరం నిపుణుల బృందం తుది నివేదికను అందించనుంది. గత రెండు రోజులుగా ప్రాజెక్టు నిర్మాణ ప్రాంతాల్లో



పర్యటించి ఎగువ , దిగువ కాపర్ డ్యాం, డి వాల్, పనులకు సంబంధించిన వివరాలు తెలుసుకున్న బృందం ఆయా పనులకు సంబంధించిన వివరాలను జల వనరుల శాఖ అధికారుల నుండి సేకరిస్తున్నారు. డయాఫ్రం వాల్ ను పరిశీలించిన బృందం శుభవార్తను వినిపించారు..పోలవరం ప్రాజెక్టులో నిర్మించిన డయాఫ్రం వాల్‌పై వరద నీరు ప్రవహించినంత మాత్రాన ఆ కట్టడానికి ఏమీ కాదని ప్రాజెక్టును పరిశీలించిన అంతర్జాతీయ జలవనరుల నిపుణులు తెలిపారు. నీళ్లలో కొంతకాలం ఉంటే దెబ్బతింటుందనే ఆలోచన సరికాదని వ్యాఖ్యానించారు. ప్రాజెక్టులో కీలక కట్టడమైన డయాఫ్రం వాల్ గోదావరి భారీ వరదలకు ధ్వంసం కాగా.. ఇప్పుడు కొత్త డయాఫ్రం వాల్ నిర్మించాలా, పాతదానికే మరమ్మతులు చేసి, కొంతమేర కొత్తది నిర్మించి పాత కట్టడానికి అనుసంధానించాలా అని ఇంజినీర్లు అడగ్గా.. ప్రస్తుతం ఉన్న డయాఫ్రం వాల్‌ను మరమ్మతు చేసుకుంటే సరిపోతుంది కదా అని ఒక నిపుణుడు వ్యాఖ్యానించారు. ఈ డయాఫ్రం వాల్‌కు కొత్త కట్టడం జత చేస్తే ఏమైనా ఇబ్బందులు ఎదురవుతాయా అని మరికొందరు ప్రశ్నించగా అలాంటివేమీ ఉండవనీ స్పష్టం చేశారు. వరద వల్ల డయాఫ్రం వాల్ కు ఎటువంటి ప్రమాదం జరగలేదని, అయిదే ఇసుక, మట్టి ఆ ప్రాంతాన్ని కప్పేయడంతో డ్రయాఫ్రం వాల్ దెబ్బతిన్నదని అనుమానాలు వ్యక్తమయ్యాయయని చెప్పారు.. డయాఫ్రం వాల్ కి ఇప్పటి వరకూ చిన్న డ్యామేజ్ కూడా జరగలేదంటూ , దీనిపై ఇంకా లోతైన అధ్యయనం చేస్తున్నామని చెప్పారు..

ఇది ఇలా ఉంటే ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే పోలవరం ప్రాజెక్టును సందర్శించిన సీఎం చంద్రబాబు.. ప్రాజెక్టు పనులపై ఆరా తీశారు.. ఇబ్బందులు, ప్రాజెక్టులో లోపాలు.. తదితర అంశాలపై దృష్టిపెట్టారు.. ఆ తర్వాత విదేశీ నిపుణులను రంగంలోకి దింపి వారి సలహాలు,సూచనలతో ఇక ముందు నిర్మాణాలు చేపట్లనున్నారు..

# ప్రధాని నరేంద్ర మోదీకి కృతజ్ఞతలు తెలిపిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

**ఆంధ్ర ప్రగతి ఢిల్లీ జులై 02:**



ఢిల్లీలో జనసేన ఎంపీలు వల్లభనేని బాలశౌరి, తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ ప్రధాని నరేంద్ర మోదీని కలిశారు. దీనిపై ప్రధాని మోదీ ట్వీట్ చేశారు. "ఇవాళ జనసేన ఎంపీలను కలిశాను. పవన్ కల్యాణ్ గారితో నేను అనేక సంవత్సరాలుగా కలిసి పనిచేస్తున్నాను. ప్రజాసేవ పట్ల ఆయన అనురక్తి, దృఢవైఖరి ఆశ్చర్యం కలిగిస్తుంటాయి. సమాజానికి తన వంతు సేవలు అందించడానికి, దేశ ప్రగతికి తోడ్పాటు అందించడానికి జనసేన పార్టీ కచ్చితంగా ముందుంటుందని నాకు గట్టి నమ్మకం" అని మోదీ తన ట్వీట్ లో పేర్కొన్నారు. కాగా, మోదీ ట్వీట్ పై జనసేనాని, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వినమ్రంగా స్పందించారు. "జనసేన ఎంపీలు వల్లభనేని బాలశౌరి, తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ లను కలిసేందుకు మీ విలువైన సమయం కేటాయించినందుకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను ప్రధాని మోదీ గారూ. ప్రజా సేవ దిశగా మా ఎంపీలకు మీరు ఇచ్చిన అమూల్యమైన సూచనల నుంచి మా జనసేన నేతలు, శ్రేణులు, నేను ఎంతో నేర్చుకుంటాం. మీకు కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాం సర్" అంటూ పవన్ కల్యాణ్ ట్వీట్ చేశారు.

# జాతీయ రహదారిపై రైతులు ఆందోళన న్యాయం చేయాలంటూ ఆగ్రహం..

**ఆంధ్ర ప్రగతి అమరావతి జులై 02:**



ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలు మండల పరిధిలోని తోటచర్ల వద్ద రైతులు ఆందోళన నిర్వహించారు. జాతీయ రహదారిపై ఎడ్లబండ్లు అడ్డుగా ఉంచి రైతుల నిరసన తెలిపారు. మండల పరిధిలోని వెంకటాపురం, కొల్లికూల్ల గ్రామాలకు చెందిన 50మంది రైతులు తమకు న్యాయం చేయాలంటూ ఆందోళన నిర్వహించారు. సుమారు గంటకు పైగా రైతుల రోడ్డుపై బైఠాయించడంతో జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది.వెంటనే స్థానిక పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని రైతులకు నచ్చజెప్పి ట్రాఫిక్ ను క్రమబద్ధీకరించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ%ౌ% కంచికచర్లకు చెందిన మిర్చి వ్యాపారి తమ వద్ద పంటను కొనుగోలు చేసి డబ్బులు చెల్లించకుండా వేధిస్తున్నాడని, దీనిపై పలుమార్లు స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినా తమకు న్యాయం జరగట్లేదంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు రూ.కోటి మేర డబ్బులు రైతులకు వ్యాపారి వద్ద నుండి రావాలని తక్షణం సంబంధిత శాఖ అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు

# పెరిగిన బంగారం.. తగ్గిన వెండి ధరలు

**ఆంధ్ర ప్రగతి అమరావతి జులై 02:**



గత కొన్ని రోజులుగా స్థిరంగా ఉన్న బంగారం ధరలు స్వల్పంగా పెరిగాయి. పుత్తడితోపాటు పెరిగే వెండి ధరలు మాత్రం కొద్దిగా క్షీణించాయి. 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం ధర 10 గ్రాములకు రూ. 400 పెరిగి రూ. 73,024కు చేరుకోగా, 22 క్యారెట్ల పుత్తడి ధర 10 గ్రాములపై 360 పెరిగి రూ. 66,890గా నమోదైంది. అదే సమయంలో వెండి ధర కిలోకు రూ. 370 తగ్గి రూ. 87,890 వద్ద స్థిరపడింది.ఇక, దేశరాజధాని ఢిల్లీలో స్వచ్ఛమైన బంగారం ధర 10 గ్రాములకు నేడు రూ.73,024 ఉండగా, వెండి ధర రూ. 87,890గా రికార్డయింది. చెన్నైలో బంగారం, వెండి ధరలు వరుసగా రూ. 73,096, రూ. 87,980గా ఉండగా, ముంబైలో రూ. 73,311, రూ. 87,890గా ఉన్నాయి. కోల్‌కతాలో రూ. 73,743, రూ. 87,890గా నమోదయ్యాయి. హైదరాబాద్‌లో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర నేడు రూ. 72,380గా ఉండగా, వెండి ధర కిలో రూ. 95,500గా ఉంది. ఈ ధరలు ఈ వార్త రాసే సమయానికి మాత్రమే. కొనుగోలు చేసిన సమయంలో కొంత హెచ్చుతగ్గులు ఉండే అవకాశం ఉంది. కొనుగోలు చేయడానికి ముందు ధరలు విచారించుకోవాల్సి ఉంటుంది.

# యువతుల అదృశ్యంపై త్వరలో ప్రత్యేక విభాగం

**కాకినాడలో డిప్యూటీ సీఎం పవన్ సమీక్ష**
**ఏపీలో 30 వేల మంది అమ్మాయిల మిస్సింగ్**
**ఓ బాలిక జమ్మూలో ఉన్నట్టు తెలిసిందన్న పవన్ కల్యాణ్**
**అదృశ్యమై 24 గంటలు గడిస్తే ఆ అమ్మాయి విషయం మర్చిపోవాల్సిందేనని వెల్లడి**



**ఆంధ్ర ప్రగతి అమరావతి జులై 02:**
ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కాకినాడ జిల్లా కలెక్టరేట్ లో వివిధ శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. కాకినాడ జిల్లా కలెక్టర్ షన్మోహన్ సగిలి, జిల్లా ఎస్పీ సతీశ్ కుమార్, పలు శాఖల అధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు. కాకినాడ జిల్లాలో ఉన్న పరిస్థితులను అధికారులు మంత్రి పవన్ కల్యాణ్ కు వివరించారు. ఈ సమీక్ష సమావేశంలో కాకినాడ జనసేన ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, జిల్లాకు చెందిన కూటమి ఎమ్మెల్యేలు నిమ్మకాయల చినరాజప్ప, వనమాడి కొండబాబు, పంతం నానాజీ కూడా పాల్గొన్నారు.
ఈ సమావేశంలో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, రాష్ట్రంలో 30 వేల మంది అమ్మాయిల ఆచూకీ లేదని, వారు ఎక్కడ ఉన్నారన్నది తెలుసుకోవాలని స్పష్టం చేశారు. ఓ బాలిక జమ్మూలో ఉన్నట్టు తెలిసిందని, 9 నెలల కిందట లవ్ ట్రాప్ తో ఆ అమ్మాయిని అపహరించినట్టు తెలిసిందని వివరించారు.
బాలిక తల్లి తనను కలిసి భోరున విలపించిందని, తాను మాచవరం సీఐకి ఈ విషయం తెలియజేస్తే... వారు వెంటనే స్పందించి అద్భుతమైన రీతిలో పనితీరు కనబరిచారని పవన్ కల్యాణ్ కొనియాడారు. కొద్ది సమయంలోనే బాలిక ఆచూకీ తెలుసుకున్నారని వెల్లడించారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఓ అమ్మాయి అదృశ్యమై 24 గంటలు గడిస్తే, ఆ అమ్మాయి దొరకడం చాలా కష్టమని, ఆ అమ్మాయి సంగతి ఇక మర్చిపోవడమేనని పవన్ కల్యాణ్ అభిప్రాయపడ్డారు. అయితే, ఏపీ పోలీసులను మాత్రం ఈ విషయంలో అభినందించాలని, ఓ అమ్మాయి అదృశ్యమైన 9 నెలల తర్వాత కూడా ఆచూకీ తెలుసుకోగలిగారని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రశంసించారు. హేట్సాఫ్ టు ఏపీ పోలీస్ అని వ్యాఖ్యానించారు. పోలీసు అధికారులతో మాట్లాడి దీనిపై ఒక ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయడంపై ఆలోచిస్తామని చెప్పారు.
ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం , జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ రెండో రోజు మంగళవారం కాకినాడ జిల్లాలో పర్యటిస్తున్నారు. ఉదయం కలెక్టరేట్‌లో పంచాయతీరాజ్, అటవీశాఖ, కాలుష్య నియంత్రణ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశమయ్యారు. జిల్లాలోని ప్రధాన సమస్యలపై చర్చించారు.
పంచాయతీరాజ్, గ్రామీణ నీటిపారుదలశాఖల పరిధిలోని పలు సమస్యలను పవన్ అడిగి తెలుసుకున్నారు.
ఈ సమావేశంలో ఎంపీ ఉదయ్ శ్రీనివాస్, జిల్లా పరిషత్ ఛైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, ఎమ్మెల్యేలు నిమ్మకాయల చినరాజప్ప, జ్యోతుల నెహ్రూ, వనమాడి కొండబాబు, పంతం నానాజీ, వరుపుల సత్యప్రభ తదితరులు పాల్గొన్నారు కాగా, అనంతరం సాయంత్రం గొల్లప్రోలులో నివాసానికి బయలుదేరి వెళతారు. పవన్ డిప్యూటీ సీఎంగా ప్రమాణం చేసిన తర్వాత వరుస సమీక్షలు నిర్వహిస్తూ ఆయా శాఖల తాజా పరిస్థితిని అధ్యాయనం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇవాళ కూడా పీఆర్, అటవీ, కాలుష్య నియంత్రణ శాఖల ఉన్నతాధికారులతో పలు అంశాలపై పవన్ చర్చించనున్నారు.